# కాంగ్రెస్‌కు 23 లేదా 30 సీట్లే

హైదరాబాద్ - న్యూస్‌టుడే

- 230 వస్తాయనుకోవడం వైఎస్ కల
- ఈ సర్కారులో ఎటుచూసినా అవినీతే
- వచ్చే ప్రభుత్వం తెలుగుదేశానిదే
- యువగర్జన చరిత్రాత్మకమవుతుంది
- తెదేపా అధినేత చంద్రబాబు వ్యాఖ్యలు

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 230 సీట్లు వస్తాయంటూ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ధీమా వ్యక్తంచేయడం అతిశయోక్తిగా ఉందని తెదేపా అధ్యక్షుడు చంద్రబాబు ఎద్దేవా చేశారు. వైఎస్ చెప్పిన అంకెల్లో ఏదో ఒకటి ఉండదని, 23 లేదా 30 సీట్లు మించిరావని జోస్యం చెప్పారు. 230 సీట్లు వస్తాయనుకోవడం ముఖ్యమంత్రి కల మాత్రమేనన్నారు. చంద్రబాబు సోమవారమిక్కడి పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీవారు ముఖ్యమంత్రి చెప్పిన లెక్కల్లో 2 తీస్తారో 3 తీస్తారో వారిష్టమని, కానీ కచ్చితంగా ఏదో ఒక అంకెను తీసేయక తప్పదని పేర్కొన్నారు. తమ పార్టీకి ఎన్నిసీట్లు వస్తాయన్న సంఖ్యను చెప్పనని, కానీ రాబోయే ప్రభుత్వం తెదేపాయే ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ఎన్టీఆర్ పార్టీని స్థాపించినప్పుడు ఉన్నన్ని సమస్యలు ఇప్పుడు పునరావృతమయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జల యజ్ఞం ధనయజ్ఞంగా మారిందని, భూగర్భ సంపదను కూడా ప్రభుత్వం తనకు నచ్చినవారికి దోచిపెడుతోందని ధ్వజమెత్తారు. అవినీతి వ్యవస్థీకృతమైందని, చివరకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి కూడా ముడుపులు అందుతున్నాయని దుయ్యబట్టారు. ఆర్థిక మంత్రి రోశయ్య కూడా అవినీతి ఉందని ఒప్పుకొంటూనే అదో సమస్యకాదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రూ.16కోట్లతో పత్రికా ప్రకటనలు ఇవ్వడం బరితెగింపుగా అభివర్ణించారు. దీన్ని కూడా ముఖ్యమంత్రి సమర్థించుకుంటున్నారని, పైగా అవినీతితో పెట్టిన సాక్షి పత్రికకే రూ.6కోట్ల ప్రకటనలు ఇచ్చారని విమర్శించారు. ఆ ప్రకటనల సొమ్ముతో నిరుపేద విద్యార్థులకు ఇవ్వాల్సిన ఉపకారవేతన బకాయిలను చెల్లించవచ్చని, మధ్యాహ్న భోజనాన్ని సమర్థంగా అమలు చేయవచ్చని పేర్కొన్నారు. ఇక ఇటీవల రూ.72కోట్లతో ప్రభుత్వం అనవసరంగా ప్రచార వాహనాలను కొనుగోలు చేసిందని, వీటిని కొనకపోతే ఉపాధ్యాయుల సమస్యలన్నింటినీ తీర్చే అవకాశం ఉండేదన్నారు. తెదేపా అధికారంలో ఉన్నపుడు ప్రచారానికి చేసిన ఖర్చుపై ఏలాంటి విచారణకైనా తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన ఖర్చుల వివరాలు బయటపెట్టాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వానికి ప్రజాస్వామ్యం, పత్రికలపై నమ్మకం లేకుండా పోయిందని విమర్శించారు. ఆంధ్రజ్యోతి పత్రికపై కాంగ్రెస్ పార్టీవారు గూండాల్లా దాడిచేయడం, బెదిరించడం బాధాకరమైన సంఘటనగా అభివర్ణించారు. ఈ సర్కారు మీడియావాచ్ పేరుతో జీవోను కూడా తెచ్చి పత్రికా స్వేచ్ఛను అడ్డుకోవడానికి ప్రయత్నించిందని పేర్కొన్నారు.

## యువగర్జనకు స్వచ్ఛందంగా యువత

గుంటూరులో ఈనెల 5వ తేదీన జరగనున్న యువగర్జన చరిత్రాత్మకమవుతుందని, రాష్ట్రంలోని దాదాపు అన్నిప్రాంతాల నుంచి 22 రైళ్లలో యువత స్వచ్ఛందంగా తరలివస్తోందని చంద్రబాబు తెలిపారు. దీంతోపాటు హైదరాబాద్, తిరుపతి, కర్నూలు, విశాఖపట్నం, ఖమ్మం జిల్లాల నుంచి గుంటూరుకు మూడువేల మంది యువకులు మోటారుసైకిళ్ల ర్యాలీ నిర్వహిస్తున్నారని చెప్పారు. ఇలా ర్యాలీగా మోటారు సైకిళ్లపై వస్తున్నవారికి ప్రత్యేకంగా పార్టీ ప్రశంసాపత్రాలు కూడా ఇస్తామని పేర్కొన్నారు. సభ జరిగేరోజున ఏలూరు నుంచి 5వేల మోటారుసైకిళ్లతో ర్యాలీ ఉంటుందన్నారు. సభకు బందోబస్తు నిర్వహించే పోలీసులు జాగ్రత్తగా ఉండాలని, అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. యువత అవినీతిపై తిరగబడాల్సిన సమయం ఆసన్నమైందని, లేకపోతే భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. ప్రభుత్వ అవినీతిపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.

## ఎన్టీఆర్‌పై డాక్యుమెంటరీ రూపకల్పన

తెదేపా వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు జీవితచరిత్రపై పార్టీ ఒక డాక్యుమెంటరీ రూపొందించింది. ఎన్టీఆర్ మొదటి సినిమా మనదేశం నుంచి మేజర్ చంద్రకాంత్ వరకు ఆయన చెప్పిన డైలాగ్‌లు, పాటలు ఇందులో ఉన్నాయి. సమాజం పట్ల ఆయనకున్న స్పృహ, ఆ మేరకు ఆయన చిత్రాల్లో ఉన్న సందేశాలను పొందుపరిచారు. 60వ దశకంలో నిర్మించిన జయసింహ చిత్రంలోనే తెలుగుదేశం అనే మాట ప్రస్తావనకు రావడాన్ని ప్రత్యేకంగా చూపించారు. పార్టీ ప్రస్థానాన్ని కూడా ఇందులో చూపారు. సుమారు 70 నిమిషాలు నిడివితో ఉన్న ఈ డాక్యుమెంటరీని సోమవారం చంద్రబాబు విడుదల చేశారు. దీంతోపాటు పార్టీకి సంబంధించిన అన్నిరకాల సమాచారం, ఎన్టీఆర్, బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్, తారకరత్న, కళ్యాణరామ్ తదితరుల సినిమాల వివరాలు, వాల్ పేపర్లు, రింగ్‌టోన్లు, కాలర్‌ట్యూన్లు తదితరాలతో రూపొందించిన www.tdpmobile.com అనే వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించారు.



యువగర్జన విజయవంతమై చంద్రబాబు మళ్లీ సీఎం కావాలని కోరుతూ విజయవాడలో కనదుర్గమ్మ సన్నిధికి ప్రమిదలతో ర్యాలీగా వెళ్తున్న తెలుగుమహిళ కార్యకర్తలు.